# 67. వీని బాస వేరు - వీని క్లాసు వేరు

నాలుగు బెర్తులున్న ఆ ఫస్ట్‌క్లాస్ కేబిన్‌లో నేనూ అతనూ తప్ప మరెవరూ లేరు. ఇద్దరం విశాఖపట్నంలోనే ఎక్కాం ఆ రైలు. నన్ను మా ఆఫీసు వాళ్లు ఢిల్లీ పంపుతున్నారు. అతను కూడా ఢిల్లీకే అని తెలిసింది. ఎలాగంటేను, అతను తన బెర్తుమీద కూచోగానే ఆఫీసు కాగితాలు బెర్తుమీద పేర్చాడు. అందులో గవర్నమెంటాఫ్ ఇండియా, మినిస్ట్రీ ఆఫ్ స్టీలు అండ్ మయిన్స్ అనే ఫ్లాప్ ఉన్న ఒక కాగితాల బొత్తి వుంది.

నాకు రైల్లో ఫస్టు క్లాసులో ప్రయాణం చెయ్యడం అది రెండోసారి. మొదటిసారి విజయవాడ నుండి మద్రాసు వరకు; ఒక వ్యాపారి మిత్రుడితో వెళ్లాను. టిక్కెట్ అతనే కొన్నాడు. అప్పటినుంచి ఈ అయిదేళ్ళకీ ఇదే ఫస్టు క్లాసులో ఎక్కడం. ఇంతకుముందు ఒకసారి నేను విశాఖపట్నం నుండి హైదరాబాదుకి ఆఫీసువాళ్లు పంపించగా ఫస్టుక్లాసులో వెళ్లే అవకాశం వచ్చింది. అయితే మా టి.ఏ.బిల్లు గుమాస్తా కారణం వల్ల నేను సెకెండు క్లాసులోనే వెళ్లవలసి వచ్చింది. అది ఎలా జరిగిందటేను -

నన్ను హైదరాబాదు పంపించాలన్న ప్రపోజలు మా ఎమ్.డి. గారు ఆమోదించిన ఫైలు మా టి.ఏ. బిల్లు గుమాస్తా సంజీవరావు నా దగ్గరికి తెచ్చేడు. "టి.ఏ. ఎడ్వాన్సుకి అప్లికేషన్ రాయి" అన్నాడు. రానూ పోనూ ఫస్టుక్లాసు టికెట్లకి యింత, మూడు రోజులు అక్కడ ఉండడానికి డి.ఏ. ఇంత-అని ఒక అంకె వేసి అంతకి అప్లికేషన్ పెట్టమన్నాడు. "ఎల్లుండే ప్రయాణం కదా, ఫస్టు క్లాసు టికెట్ దొరుకుంతుందా?" అన్నాను. "ఎడ్వాన్సు పుచ్చుకోమన్నాను గాని ఫస్ట్ క్లాసులో వెళ్లమన్నానా?" అని నవ్వేడు సంజీవరావు. "మరి టిక్కెట్ నంబర్లు వెయ్యకుండా బిల్ పాసవదుకదా. అప్పుడు ఆఫీసుకి నేను డబ్బు కట్టవలసొస్తుందే" అన్నాను. "నీ జేబులోది తీసి కడతావేమిటి? ఇప్పుడు పుచ్చుకున్న దాంట్లోదే అప్పుడు కడతావు. టి.ఏ. బిల్లు ఇవ్వడానికి మూడు నెలలు టైముంటుంది. అప్పుడు కదా కట్టాలి! చక్కగా ఫస్ట్ క్లాస్ ఛార్జీలకి అడ్వాన్సిమ్మని రాసి, డబ్బు పుచ్చుకో, హాయిగా ఖర్చు పెట్టుకో. హైదరాబాదు నుంచి ఇష్టమైనవో చిత్రమైనవో ఏమైనా కొని తెచ్చుకో. మూడు నెలల పాటు వడ్డీ లేని అప్పు ఎంజాయి చెయ్యి" అన్నాడు సంజీవరావు. సరేకదా అని అప్లికేషను అతను చెప్పినట్టు రాసేను. "ఇది నేను పాస్ చేయించి రేపటికల్లా కేష్ చేయిస్తాను గాని, నువ్వు వెంటనే రైలు స్టేషనుకు కెళ్లి రెండవ తరగతి టికెట్ బుక్ చేసుకురా" అని అని తన జేబులోంచి నూరు రూపాయల నోటు ఒకటి తీసి యిచ్చాడు. మర్నాడు కేష్ ఇప్పిస్తూ ముందు రోజున తను యిచ్చిన నూరుకాక మరో నూరు రూపాయలు తీసుకున్నాడు. "నిన్ననేమో నువ్వు నాకు నూరు రూపాయలు బాకీ. ఇవాళ చూడు, నేనే నీకు నూరు రూపాయలు బాకీ. ఇదే ఈ మాయాలోకంలోని విచిత్రం." అని నవ్వేడు. నేను వెర్రి మొహం వేసి చూసేను. "అదేంటీ, నేను తిరిగి ఇవ్వననుకుంటున్నావా?బలేవాడివే. నువ్వు మూడునెలల తర్వాత టి.ఎ. బిల్లు పెడతావు కదా. అప్పుడు నువ్వు ఆఫీసుకి కట్టవలసిందెంతో నేనే తేల్చాలి కదా! అందులో నూరు రూపాయలు నేనే ఆన్ ది స్పాట్ ఇచ్చేస్తాను." అన్నాడు సంజీవరావు. ఆ విధంగా వడ్డీలేని అప్పు నేను నాలుగు వందలు తీసుకుంటే అతను ఒక వంద తీసుకున్నాడు.

★★★

నా ఎదురుగుండా బెర్తులో వున్న అతను తను అక్కడ సెటిలవగానే కాగితాలూ పుస్తకాలూ పత్రికలూ ప్రదర్శించేడు కదా. నేను మాత్రం ఏంతక్కువ తిన్నాను - అనిపించి నేను తెచ్చినవి కూడా నా బెర్తు మీద పెట్టుకున్నాను.

అతను ఆ రంగు రంగుల మేగజైన్లూ అత్యాధునిక విదేశీ కల్పనా సాహిత్యం గ్రంథాలూ అలా వదిలేసి ఒక ఇంగ్లీషు దినపత్రిక భారీగా తెరిచి పట్టుకుని నిశితంగా నిశ్శబ్దంగా చదువుతూ వుండగా, ఒకానొక క్షణంలో ఆ పేపర్ని పైకి ఎత్తి పట్టుకున్నందువల్ల నా మొహం అతనికీ అతని మొహం నాకూ కనబడకుండా ఒకేసారి సూర్యగ్రహణం, చంద్రగ్రహణం పట్టేశాయి. ఆ అవకాశం వల్ల అతను తెచ్చిన గ్రంథాలూ మేగజైన్లు ఏమిటా అని నేను క్రీగంట గమనించాను. అబ్బో! అవి నేనెన్నడూ ముట్టుకోడానికి కూడా సాహిసించనంతటి ఉన్నతమైనవి! డెబొనైర్ అని ఒక ఇంగ్లీషు పత్రిక. జెంటిల్‌మేన్ అనేది ఒకటి. స్పోర్ట్స్ వీక్. స్టార్ డస్ట్ - ఆ క్రిందిని అన్నిటికంటే అట్టడుగున్నది ప్లేబాయ్. ఇక గ్రంథాలా! ఇర్వింగ్ వేలస్, ఆర్థర్ హేలీ, సిడ్నీ షెల్డాన్, రాబర్ట్ లుడ్‌లుమ్ అనే నలుగురు రచయితలవి తలా ఒకటి. న్యూస్ పేపరు కూడా ఇప్పుడు అతను చదువుతున్నది కాక మరొకటి వుంది.

అప్రయత్నంగా నేను తెచ్చుకున్న వాటివేపు చూసాను. 'కాలాతీత వ్యక్తులు' అని ఒక నవల. 1949 లో వేసిన 'భారతి' రజతోత్సవ సంచిక. శంకరమంచి సత్యం రాసిన 'అమరావతి కథలు', 'పౌలస్త్య హృదయం', 'ఏకాంతసేవ' - అన్నీ తెలుగే! ఇంగ్లీషు చదవడం వచ్చీ కూడా మాతృభాషా దురభిమానం చేత అప్పుడెప్పుడోనూ, అప్పుడప్పుడూనూ చదివిన, చదువుతూ వుండిన-ఆ పాత పుస్తకాలు తెచ్చుకున్నందుకు కొంచెం సిగ్గేసింది. పాతవి ఎంత బాగుంటే మటుకు-కాలంతో బాటు అభిరుచిని ముందుకి తీసికెళ్ళలేకపోతున్నానే అని కొంచెం సేపు విచారించినా, ఈ బండి ఢిల్లీ వెళ్లడానికి నలభై గంటలు పడుతుంది కదా; ఈ లోపుని అతన్నడిగి కనీసం ఒక్క అధునాతన మాస్టర్ పీస్‌ని తిరగెయ్యలేకపోతానా అని ధైర్యం కూడా కలిగింది.

రైలు బెజవాడ చేరేసరికి రాత్రి ఏడు గంటలవుతోంది. ఈ 350 కిలోమీటర్ల దూరంలోనూ అతనితో నేను మూడు నాలుగు మాట్లు ప్రయత్నించి కూడా మూడు నాలుగు మాటలకన్నా మాట్లాడించలేకపోయాను. రాజమండ్రిలో కాఫీ కొనుక్కున్నాను. ప్లాట్‌ఫారం మీది నుంచి కిటికీ వూసల ద్వారా పింగాణీ కప్పుతో వచ్చిన కాఫీ అందుకుంటున్నప్పుడు అతను నావేపు, శ్రద్ధగా, ఆసక్తిగా చూస్తూ వుంటే "మీరు పుచ్చుకోరా?" అని అడిగాను. "నో, నో, నో! ఇలా ప్లాట్‌ఫారం వెండర్స్ సరఫరా చేసేవి నే నెప్పుడూ పుచ్చుకోను. కేటరింగ్ సర్వీస్ వాళ్లు రాలేదేమా అని చూస్తున్నాను. మీరు కానీండి." ఇంత వివరంగా అతను చెప్పేడని కాదు. అతని పొడి పొడి మాటల్ని వాక్యాల్లో పెడితే ఇలా అవుతుందన్న మాట. పైగా అవన్నీ ఇంగ్లీషు మాటలు. "ఎక్కువ మాట్లాడిన కొద్దీ ఎక్కువ తప్పుమాటలు" అన్న సూత్రం తెలిసిన వాడిలా "ఎకానమీ ఆఫ్ వర్డ్స్" పాటించేడతను.

అలాగే నిడదవోలు స్టేషన్‌లో చక్కెరకేళీ అరటిపళ్లు వస్తే ఒక డజన్ తీసుకుని బుట్టలో పెట్టుకుంటున్నప్పుడు అతను నా వేపు చిత్రంగా చూసేడు. ఒకటి తీసి అతని ముందుకి జాపి "తీసుకోండి" అన్నాను. అతను "నో, థాంక్స్" అని పేపరు మొహానికి అడ్డం పెట్టుకున్నాడు.

ఏలూరు స్టేషన్‌లో కేటరింగ్ సర్వీస్ వాళ్ల మనిషి యూనిఫారంలో వచ్చేడు. కాఫీ పాట్ కారిడార్‌లో ఉంచి, తల లోపలికి పెట్టి "మీల్స్." అన్నాడు. నా ఎదుటి బెర్తాయన ఒక వేలు చూపించాడు. అతనేదో చీటీ లాటిది ఇచ్చేడు. ఇతను దాన్ని చదువుకున్నాడు. పర్స్‌లోంచి యాభైరూపాయల నోటు తీసి ఇచ్చేడు. వాడు కొన్ని చిల్లర నోట్లు ఇచ్చి "టూ రుపీస్ లెస్ సార్. విల్ గివ్" అన్నాడు. ఇతను "ఓ. కే" అన్నాడు. నేను కలగజేసుకుని "వాడి దగ్గర కాఫీ ఉందండీ" అన్నాను. "ఓ మై గుడ్నెస్. భోజనం టైమ్ దగ్గర పడుతోందిగా. నో కాఫీ నౌ" అనేశాడు అతను.

మా 'డి' కేబిన్‌లో మిగిలిన రెండు బెర్తులూ బెజవాడలో నిండేయి. వాళ్ళిద్దరూ కూడా ఒకరితో నొకరు సంబంధంగాని స్నేహం గాని లేనివాళ్లే. నా మీదా, ఇతని మీదా రెండేసి "ఎక్స్యూజ్మీలూ" "ఇఫ్ యు డోంట్ మైండ్" లూ విసిరేసి వాళ్ల సామాన్లు మా బెర్తుల క్రింద సర్దేసుకుని ఇద్దరు చెరో పై బెర్తూ ఎక్కిపోయి సెటిలైపోయారు.

ఇతనికి భోజనం రాలేదు.

బండి బయల్దేరిన తర్వాత ఇందాకటి యూనిఫాం అబ్బాయి వచ్చి, "ఎక్సూజ్ సార్" అని మొదలెట్టి మీల్సు ఇవ్వనందుకు వివరంగా సంజాయిషీ చెప్పేడు. 'లాట్' అంతా 'సెకండ్ క్లాస్ బోగీకి' చేర్చడం అయిందట. 'బోయ్' అక్కడ అవి 'డిస్ట్రిబ్యూట్' చేస్తూ బిజీ అయిపోయాడట. ఈ 'బోగీ'లో ఇతనిది ఒక్కడిదే "ఆర్డర్"ట. ఆ సెకండ్ క్లాస్ బోగీకి దీనికీ మధ్య 'వెస్టిబ్యూల్' లేదట. "నెక్స్‌ట్ హాల్ట్" ఖమ్మమ్‌లో 'కంపల్సరీగా' ఇచ్చేస్తాట్ట. ఆఖర్ని కూడా ఒక 'ఎక్సూజ్' చెప్పేడు. ఇతను వాణ్ణి ఇంగ్లీషులోనే చెడామడా తిట్టి; బ్రతిమాలు కోడం దగ్గర్నించీ ఘాటుగా తిట్టుకోడం దాకా ఎన్నో వ్యవహారాలకి ఇంగ్లీషు మీడియం మహా గొప్ప సౌకర్యంగా ఉంటుందన్న సంగతి మరోసారి రుజువు చేసేడు.

నేను బెర్తుక్రింద నుంచి నా ప్లాస్టిక్ బుట్ట తీసి బెర్త్‌మీద పెట్టేను. దాని మీది భాగంలో ఉన్న దళసరి రుమాలు తప్పించేను. బుట్టలో ఉన్న పూరీల పొట్లాం, పెరుగూ అన్నం గిన్నె-బైట పెట్టేను.

"జరిగిందేదో జరిగింది. దురదృష్టమే. ఈ బండి ఖమ్మం చేరేసరికి పదకొండు అవుతుంది. మీరు మధ్యాహ్నం పన్నెండున్నర నుంచి పచ్చి మంచినీళ్లు కూడా తాగలేదు. ఇందులో ఎనిమిది పూరీలున్నాయి. ఈ గిన్నెలో పట్టెడు పెరుగన్నం ఉంది. బుట్టలో డజను చక్కెర కేళీలున్నాయి. వీట్లో మీకు ఏం కావాలంటే అవి తీసుకుని ఆరగించండి. ఆ భోజనం టిక్కెట్టు వాడికిచ్చేసి ఆ డబ్బూ, ఇందాక బాకీ పెట్టిన రెండు రూపాయలూ వాసూలు చేసుకోండి" అన్నాను.

అతను మొదట, "నో, థాంక్సు" అన్నాడు.

మళ్లీ నేను వెంటబడితే "మీకు అనవసరం శ్రమ" అన్నాడు.

ఇంకా నేను వదలక పోతే "అవన్నీ ఎప్పుడు చేసేరో..." అన్నాడు.

"సరే మీ ఖర్మ" అనబోయి "పోనీ లెండి, మీ యిష్టం" అన్నాను.

అప్పుడతను ప్రసన్నుడై "ఓ.కే. ఐ గివ్ యూ ట్రబుల్. యు విన్" అన్నాడు. పెట్టినవన్నీ తిన్నాడు. "థాంక్యూ! ఇట్స్ రియల్లీ డెలిషస్. స్టేషన్‌లో వాడు ఆ మీల్స్ తెచ్చినా అవన్నీ 'స్టేల్' ఐపోతాయేమో" అని కూడా అన్నాడు.

"అవును, వాళ్లు చేసింది వేగిరం పాసిపోతుంది" అని నేనూ చెప్పేను.

రైలు ఖమ్మం చేరేక యూనిఫారం ధరించిన కేటరింగ్ సర్వీస్ అబ్బాయిని వెతికి పట్టుకుని భోజనం చేసిన వాడికున్నంత బలంతో, ఆకలేసిన వాడికొచ్చినంత కోపంతో మళ్లీ ఛడామడా తగులుకున్నాడు. కాని, ఆ అబ్బాయికూ్కడా గవర్నమెంటాఫ్ ఇండియా కున్నంత బలం ఉంది. చెల్లించిన సొమ్ము ఎట్టి పరిస్థితిల్లోనూ వాపస్ ఇవ్వబడదన్నాడు. రేపు మధ్యాహ్నం బలార్షాదాటేక సప్లయిచేసే 'లంచి'కి వర్తించేటట్టుగా ఈ టికెట్ మీద గుర్తు రాస్తానన్నాడు.

మర్నాడు మధ్యాన్నం మూడున్నరకి నా ప్లాస్టిక్ బుట్టలోంచి పోలిపూర్ణంబూరెలూ, పులిహోరా తీసి నాతో ఉన్న ముగ్గురికీ పెట్టేను. సీసాలోంచి పెరుగు తీసి వడ్డించాను. 'బూరెలూ, పులిహోరా పాసిపోకుండా ఉన్నాయే' అని ఆశ్చర్యపడితే కొన్నిరకాల వంటలు కొన్నిరకాల చేతులతో చేస్తే నిలవ ఉంటాయి- అంటూ దాని సూత్రం చెప్పేను. "మరి, పెరుగు ఇంత కమ్మగా ఎలా వుంది?" అని ముగ్గురూ ఏక కంఠంగా ముదలకించేరు.

"ఏముంది? రాత్రి పన్నెండు గంటలకి ఫ్లాస్కులో ఉన్నపాలు తీసి హార్లిక్సు సీసాలో పోశాను. మూడు గంటలప్పుడు చిటికెడు తోడు వేసేను. అంతే!" అని ఆ సూత్రం కూడా చెప్పేను.

అప్పుడు పరిచయం చేసుకొన్నాడు; నా ఎదుటి బెర్త్ ఆయన. "అయామ్ సుదర్శనం, జూనియర్ మేనేజర్-ఫలానా ఆఫీసు-" అంటూ.

"నా పేరు గోపాలం. పోర్టు ట్రస్ట్‌లో సీనియర్ సర్వేయర్." అని చెప్పేను.

అప్పుడు మళ్ళా డొంక తిరుగుడు ప్రారంభం అయింది. "జూనియర్ మేనేజరుకి సీనియర్ సర్వేయర్‌కన్నా బేసిక్ పేఎక్కువా, తక్కువా? ప్రస్తుతం స్టేజి ఎంత? రేటాఫ్ ఇంక్రిమెంట్ ఎంత?"- వగైరా బాదర బందీలు వచ్చిపడ్డాయి. ఎవడిబేసిక్ పే తక్కువయితే వాడే ముందు "గుడ్మాణింగ్ సార్" అనాలి. వీడు తెలుగులో మాట్లాడాలి. వాడు ఇంగ్లీషులో మాట్లాడాలి. ఎన్ని గొడవలు!

ఢిల్లీలో రైలు దిగేటప్పుడు చెప్పేను. "సుదర్శనం గారూ, మనం యిట్నించి వెళ్ళేటప్పుడు హాయిగా సెకండు క్లాసులో పోదామండీ, బోలెడంత సందడి. జనులంతా సమానం కాదని తెలిసినా ఏదో ఒక ఆత్మీయత ఉంటుంది. ఏమంటారు?"

నేను ఢిల్లీ నుంచి వచ్చిన తర్వాత పదిహేను రోజులకి సుదర్శనంగారు నా స్కూటర్ మెకానిక్ దగ్గరే తన స్కూటర్ బాగుచేయించుకుంటూ కనబడ్డారు.

"మీరెప్పుడు రిటర్నయ్యేరు?" అని పలకరించేను.

"ఐ స్టేడ్ దేర్ ఓన్లీ ఫోర్ డేస్" అని మొహం ముడుచుకున్నాడు. "హెల్లనుకోండి. నా ఎదుటి బెర్త్‌లో అదేదో కంపెనీలో ఎమ్‌డీట. బాల శౌరీ రాయో ఏదో చెప్పేడు పేరు. తన హోషు, దర్జా, ఫోజు అన్నీ నామీదే చూపించేడు విశాఖపట్నం చేరే దాకాను" అన్నాడు సుదర్శనం గారు.

అల్లుణ్ణి బల్లుడు కొడితే బల్లుణ్ణి బ్రహ్మదేవుడు కొట్టేడట-అని వెనకటి రోజుల్లోవో సామెత.

★